ఆంజనేయస్వామి ఆలయం ప్రారంభం

కెరమెరి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్మాపూర్ గ్రామంలో నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అర్చకులు మాడుగుల నారాయణమూర్తి శర్మ, మధుకర్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు నవగ్రహ, తదితర ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బలిరాంనాయక్, రవినాయక్, హరిరాంనాయక్, పార్థిరామ్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవలో ఎల్లప్పుడూ ముందుంటాం



మజ్జిగ పంపిణీ చేస్తున్న ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

- ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పోలీసుశాఖ ప్రజారక్షణతో పాటు ప్రజాసేవలో ఎల్లప్పుడు ముందుంటుందని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో పోలీసు మీకోసం కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మజ్జిగ కేంద్రంలో ప్రతి రోజు సుమారు 500 మంది వరకు పంపిణీ చేస్తామన్నారు. వేసవికాలంలో ప్రజల దప్పిక తీర్చేందుకు జిల్లాలోని ప్రతీమండల కేంద్రంలో ఆయా పోలీసుస్టేషన్ల పరిధిలో పోలీసు అధికారులతో చలివేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ అడ్మిన్ ప్రభాకర్, ఏఎస్పీ చిత్తరంజన్, సీఐ రవీందర్, సత్యనారాయణ, ఎస్సైలు అంజన్న, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

మొబైల్ ఫోన్ల అందజేత..

ఎవరైనా వ్యక్తులు మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న లేదా మిస్ అయిన వెంటనే స్థానిక పోలీసుస్టేషన్‌లో లేదా సీఈఐఆర్ వెబ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు సూచించారు. జిల్లా వ్యాప్తంగా మొబైల్ ఫోన్‌లు పోగొట్టుకున్న 50 మంది బాధితులకు బుధవారం తిరిగి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొబైల్ ఫోన్‌లు జాగ్రత్తగా ఉంచుకోవాల న్నారు. నేరస్తులు దొంగలించిన మొబైల్ ఫోన్ల ను దుర్వినియోగం చేసే అవకాశం ఉందన్నా రు. అప్రమత్తంగా ఉంటూ వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని ఎస్పీ సూచించారు.

ఈ సందర్భంగా ఆసిఫాబాద్ పోలీసు స్టేషన్ పరిధిలో ఎనిమిది, కాగజ్‌నగర్ టౌన్‌లో 10, కెరమెరిలో మూడు, వాంకిడి మూడు, రెబ్బెనలో ఎనిమిది, కౌటాలలో ఏడు, కాగజ్‌నగర్ రూరల్‌లో మూడు మొత్తం 50 ఫోన్లను రికవరీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్పీ అడ్మిన్ ప్రభాకర్, స్పెషల్ బ్రాంచి ఇన్‌స్పెక్టర్ రాణాప్రతాప్, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, ఐటీ కోర్ ఎస్సైలు సౌమ్య తేజస్విని, ఐటీ కోర్ కో ఆర్డినేటర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



రికవరీ చేసిన ఫోన్లు, బాధితులతో ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

- పశుగ్రాసం దొరకక అల్లాడుతున్న మూగజీవాలు
- వరిసాగు తగ్గడంతో తీవ్ర ఇబ్బందులు
- పొరుగు ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్న రైతులు



ప్లాస్టిక్ కవర్లను తింటున్న పశువులు(ఫైల్)



పొరుగు జిల్లాల నుంచి వ్యాన్‌లో వస్తున్న పశుగ్రాసం

మూగ రోదన

ఆసిఫాబాద్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వేసవి వచ్చిందంటే పశువులకు మేత కష్టాలు తప్పడంలేదు. వేసవికాలంలో మేత, నీరు దొరక్క మూగ జీవాలు అల్లాడుతున్నాయి. పశుగ్రాసం కరువు అవడంతో రైతులు పొరుగు ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. మేత కంటే దాని రవాణే వారికి తడిసి మోపెడవుతోంది. లారీ గడ్డి 25వేల రూపాయల నుంచి 30 వేల రూపాయల వరకు పెట్టి కొనుగోలు చేస్తున్నారు.

కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో వివిధ గ్రామాల్లో రైతులకు పశు పోషణ పెను భారంగా మారింది. జిల్లాలో వరి పంట అతి తక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తుంటారు. జిల్లాలో దహెగాం, సిర్పూర్(టి), తిర్యాణి, రెబ్బెన, కౌటాల, బెజ్జూరు, కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ మండలాల్లో మాత్రమే వరి సాగు చేస్తుంటారు. వాంకిడి, కెరమెరి, జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్ మండలాల్లో నీటి లభ్యత లేని కారణంగా అక్కడి రైతులు ఆరుతడి పంటలైన పత్తి, సోయా పంటలనే పండిస్తుంటారు. దీంతో ప్రస్తుతం గ్రామాల్లో గ్రాసం కోసం రైతులు ఇబ్బందులు పడుతూ ఈ వేసవిలో పశువులకు గ్రాసం ఎలా సమకూర్చాలో అర్థంకాక ఆందోళన చెందుతున్నారు.

ప్లాస్టిక్ కవర్లను తింటూ.. మురుగునీరు తాగుతూ..

జిల్లా అంతటా పశుగ్రాసం కొరత తీవ్ర రూపం దాల్చింది. పశుగ్రాసం కోసం రైతులు చాలా ఇబ్బందులకు గురి కావాల్సి వస్తోంది. పశుగ్రాసం దొరకక పశువులు విలవిలలాడుతున్నాయి. ఓ వైపు తాగునీరు, మరో వైపు పశుగ్రాసం లభించక పశువులు బక్కచిక్కి పోతున్నాయి. దీంతో రైతులకు పశు పోషణ భారం కావడంతో కబేళాలకు అమ్మేస్తున్నారు. ఇక ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ పట్టణ ప్రాంతంలో పశువుల తీరు దయనీయంగా మారింది. గ్రాసం దొరకక చెత్త కుప్పలపై ఉన్న కాగితాలను, ప్లాస్టిక్ కవర్లను తింటూ మురికి కాలువల్లో నీటిని తాగుతూ రోగాల బారిన పడుతున్నాయి. ఇప్పటి వరకు పశుగ్రాసం కొరతను తీర్చేందుకు పశు సంవర్ధక శాఖ అధికారులు నీటి వసతి ఉన్న ప్రాంతాలను గుర్తించి పశుగ్రాసం పెంచే విధంగా రైతుల్లో అవగాహన కల్పించడం లేదంటున్నారు. పశు సంవర్ధక శాఖాధికారులు పట్టించుకోక పోవడంతో పశుగ్రాసాన్ని పెంచేందుకు ఆసక్తి చూపడం లేదు.

● జిల్లాలో పశు సంపద..

కుమరం భీం జిల్లాలో 10,17,833 పశువులు ఉండగా ఆవులు 2,78,674, బర్రెలు 51,354, గొర్రెలు 83,813, మేకలు 1,84,726 ఉన్నట్లు పశువైద్యాధికారులు చెబుతున్నారు. వీటన్నింటికి సరిపడా గ్రాసం లేక ఎక్కడి నుంచి తెచ్చుకోవాలో తెలియక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో అనుకున్నంత స్థాయిలో వరి సాగు చేయకపోవడంతో పక్క జిల్లాలైన మంచిర్యాల, పెద్దపల్లి, కరీంనగర్ తదితర ప్రాంతాల నుంచి రైతులు వరి గడ్డిని కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం గడ్డి కొరత ఏర్పడి డిమాండ్ బాగా పెరిగింది. వరి గడ్డి కట్టకు రూ.120నుంచి రూ.130 ధర ఉండగా, లారి గడ్డి రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు పెట్టి కొనాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి పశు వైద్య కేంద్రాల ద్వారా గ్రాసం సరఫరా చేస్తే తమకు కొంతైనా ఊరట లభిస్తుందని జిల్లాలోని రైతులు విన్నవించుకుంటున్నారు.

● కబేళాలకు తరలుతున్న పశువులు..

పశుపోషణ భారంగా మారడంతో రైతులు వాటిని కబేళాలకు తరలిస్తున్నారు. రైతులు అల్లారుముద్దుగా పెంచుకున్న తమ పశువుల ఆకలి కేకలను వినలేక దయనీయ దుస్థితిని చూడలేక దళారులకు అమ్ముకుంటున్నారు. పాడి పశువులు కళ్ల ముందే కబేళాలకు తరలి పోతున్న తీరును చూస్తూ రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. స్థానిక దళారులు పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్రకు చెందిన దళారులు పలు గ్రామాల్లో పశువులను కొనుగోలు చేస్తూ రాత్రికి రాత్రే కబేళాలకు చేరవేస్తున్నారు.

పొరుగు జిల్లాల నుంచి పశుగ్రాసం తెస్తున్నాం..

- గజ్జల రాజన్న, రైతు, ఆసిఫాబాద్



పశుగ్రాసం కొరత తీవ్రంగా ఏర్పడడంతో మంచిర్యాల జిల్లా దండెపల్లి, లక్షెట్టిపేట నుంచి వరి గడ్డిని కొనుగోలు చేసి తీసుకు వస్తున్నాం. జిల్లాలో వరిసాగు అంతంత మాత్రంగానే ఉండడంతో పొరుగు జిల్లాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తున్నది. లారీ పశుగ్రాసానికి రూ.25 వేల నుంచి రూ.30 వేలు వెచ్చించి కొనుగోలు చేయాల్సి వస్తోంది. దీంతో రైతులపై ఆర్థికంగా భారం పడుతోంది.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

- సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు





సిమెంట్ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ హరీష్ బాబు, దహెగాంలో చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

కాగజ్‌నగర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు తెలిపారు. బుధవారం మండలంలోని అందవెల్లిలో రూ.10లక్షలతో చేపట్టిన సిమెంటు రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ పథకం కింద నిధులు విడుదల చేసినట్లు పేర్కొన్నారు. పనులు పెండింగ్‌లో లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ చన్నాషురి గణపతి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, మల్లేష్, శ్రవణ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పశువుల కోసం ఏర్పాటు చేసిన గాలికుంటు వ్యాధి టీకా కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి డాక్టర్ విజయ్, డాక్టర్ పరిమళ, డాక్టర్ రాజ్‌కుమార్, గోపాల మిత్ర రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ..

దహెగాం (ఆంధ్రజ్యోతి): కల్యాణలక్ష్మి చెక్కులను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. దహెగాం మండల కేంద్రంలోని రైతు వేదికలో 80 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను బుధవారం పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తీసుకు రావడంతో దహెగాం-కోత్మీర్ గ్రామాల మధ్య 12 కిలో మీటర్ల డబుల్ రోడ్డు పనులు ప్రారంభమైనట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వద్ద నిధులు లేకపోవడంతో అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయని పేర్కొన్నారు. దహెగాం మండల కేంద్రంలోని సీనియర్ కార్యకర్త నారా సుధాకర్, నారా లచ్చన్న తల్లి రెండో రోజుల క్రితం మృతి చెందడంతో వారి కుటుంబాన్ని పరామ ర్శించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కవిత, పీఏసీఎస్ చైర్మన్ తిరుపతిగౌడ్, నాయకులు ధనుంజయ్, తదితరులు పాల్గొన్నారు.

పెంచికలపేట(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 35 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేసి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అనంతరం మండల కేంద్రంలోని చౌరస్తాలో ఘనపురం సుశీల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఎంపీడీవో అల్బర్ట్, నాయకులు పాల్గొన్నారు.

హోల్‌సేల్ దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు

చింతలమానేపల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రవీంద్ర నగర్ గ్రామంలో పలు హోల్‌సేల్ దుకాణాలను ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వాసురామ్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలం అయినందున ఎక్కువ రోజులు నిల్వ ఉంచిన శీతల పానియాలు, ఆహార పదార్థాలను ఆకస్మికంగా తనిఖీ చేశామన్నారు. ప్రజలకు కల్తీ ఆహార పదార్థాలను విక్రయిస్తే హోల్‌సేల్ దుకాణాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపినట్లు తెలిపారు. నివేదిక వచ్చిన తరువాత చట్టపరమైన చర్యలతో పాటు అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఆహార పదార్థాలను కల్తీ చేసి అమ్మితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

కల్తీ ఆహార పదార్థాలు అమ్మినట్లు ఫిర్యాదు చేస్తే చర్య లు తీసుకుంటామని తెలిపారు. లైసెన్సు లేకుండా దుకాణాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట సిబ్బంది నరేష్ ఉన్నారు.

చలివేంద్రంను సద్వినియోగం చేసుకోవాలి

- డీఎస్పీ రామానుజం



సిర్పూర్(టి)లో చలివేంద్రం ప్రారంభిస్తున్న డీఎస్పీ రామానుజం

సిర్పూర్(టి), ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఎస్పీ రామానుజం అన్నారు. బుధవారం సిర్పూర్(టి) మండల కేంద్రంలోని బస్టాండు ఏరియాలో పోలీసులు మీ కోసంలో భాగంగా చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రయాణికుల, ప్రజల దాహార్తిని తీర్చేందుకు పోలీసుశాఖ ద్వారా చలివేంద్రం ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో సీఐ రమేష్, ఎస్సైలు కమలాకర్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

కౌటాల(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తలోడి ఎక్స్‌రోడ్‌లో పోలీసులు మీ కోసం కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన చలివేంద్రంను సీఐ రమేష్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్సై మధుకర్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

బెజ్జూరు(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ చలివేంద్రంను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం మండల కేంద్రం నుంచి వివిధ గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో గౌరిశంకర్, కార్యదర్శి తుకారాం తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ పక్వాడ



ఈదులవాడలో అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

ఆసిఫాబాద్‌రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈదులవాడ అంగన్‌వాడీ పాఠశాలలో పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, పిల్లలకు తీసుకోవాల్సిన పోషకాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ లైలా, అంగన్‌వాడీ టీచర్లు పద్మ, మంజుల, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

జైనూర్ (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ప్రతీ రోజు సరైన మోతాదులో పౌష్టికాహారం అందించాలని జైనూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి ఇందిర సూచించారు. మండలంలోని జంగాం కోలాంగూడలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్షోత్సవాల సందర్భంగా బుధవారం మాట్లాడారు. గర్భవతులు విటమిన్లు, ఐరన్, కాల్షియం, ప్రోటీన్స్ ఉండే ఆహార పదార్థాలను తీసుకోవాలని సూచించారు. ఆకుకూరలు, పండ్లు, ఫలాలు నిత్యం తీసుకోవాలన్నారు. అనంతరం పోషక ఆహారం, ఇమ్యూనైజేషన్ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. సూపర్ వైజర్ సుజాత, మాజీ వైస్ ఎంపీపీ చిర్లే లక్ష్మణ్, బ్లాక్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్, గ్రామ పటేల్ ఆత్రం రమేష్, హెచ్‌ఎం సిడాం లక్ష్మణ్, పాల్గొన్నారు.

కౌటాల (ఆంధ్రజ్యోతి): కౌటాల మండల కేంద్రంలోని అంగన్‌వాడీ పాఠశాలలో బుధవారం పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, పిల్లలకు తీసుకోవాల్సిన పోషకాహారంపై అవగాహన అంగన్‌వాడీ టీచర్లు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనానికి వంట పాత్రల పంపిణీ



దహెగాంలో వంట పాత్రలు పంపిణీ చేస్తున్న ఎంఈవో

దహెగాం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): దహెగాం మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు వంట పాత్రలు, గ్యాస్ స్టౌవ్‌ను ఎంఈవో శ్రీనివాస్ ప్రధానోపాధ్యాయులకు బుధవారం పంపిణీ చేశారు. 20 మంది విద్యార్థుల కంటే ఎక్కువగా చదువుతున్న 30 ప్రాథమిక, ఆరు ప్రాథమికోన్నత, ఐదు ఉన్నత పాఠశాలలకు వంట పాత్రలు పంపిణీ చేశామని ఎంఈవో శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

వాంకిడి (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాఠశాలలకు మధ్యాహ్న భోజన పథకం వంట పాత్రలను ఎంఈవో శివచరణ్ బుధవారం పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఎంఈవో శివచరణ్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం అమలులో వంట పాత్రలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఆర్పీ సందీప్, ప్రధానోపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

అర్హత కలిగిన ప్రతీఒక్కరికి సంక్షేమ ఫలాలు

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన లబ్ధిదారులకు అందేవిధంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్‌లతో కలిసి భూ భారతి చట్టం అమలు, సన్న బియ్యం పంపిణీ, నకిలీ విత్తనాల అక్రమ రవాణా నివారణ చర్యలు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, అర్హులైన జాబితా రూపకల్పన, వేసవిలో తాగునీటి సరఫరా అంశాలపై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందించే విధంగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. భూ భారతి నూతన ఆర్‌వోఆర్ చట్టంలోని అంశాలు, హక్కులపై అవగాహన కల్పించడంతో పాటు రైతులకు మేలు కలిగే విధంగా అప్పీల్ చేసుకునే అవకాశం భూభారతిలో ప్రభుత్వం కల్పించిందన్నారు. విరాసత్, పాలు పంపకాలు, కొనుగోలు పట్టా మార్పిడిలో సంబంధీకులకు నోటీసులు జారీ చేసే అవకాశం కల్పించడం ద్వారా పారదర్శకమైన పట్టా మార్పిడికి అవకాశం ఉంటుందని తెలిపారు. భూ భారతి చట్టంపై ఈ నెల 17 నుంచి 30 తేదీ వరకు ప్రతి మండల కేంద్రంలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి రైతులకు వివరిస్తామని తెలిపారు.

జిల్లాలోని 314 పౌరసరఫరాల దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీకి అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటి వరకు 90 శాతం సన్న బియ్యం పంపిణీ చేశామని, పూర్తి స్థాయిలో చేసేందుకు చర్యలు చేపడుతామని వివరించారు. జిల్లాలో 80 శాతం పత్తి సాగు జరుగుతున్నందున నకిలీ విత్తనాల అక్రమ రవాణా జరగకుండా నకిలీ విత్తనాలు విక్రయించకుండా విస్తృత స్థాయిలో తనిఖీలు చేపడుతామన్నారు. సరిహద్దు ప్రాంతాల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి నకిలీ విత్తనాల అక్రమ రవాణా అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మండల స్థాయిలో తహసీల్దార్లు, ఎస్సై, వ్యవసాయాధికారుల ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేసి నకిలీ విత్తనాల రవాణా జరగకుండా చూడాలన్నారు. నకిలీ విత్తన వినియోగం వల్ల కలిగే నష్టాలపై రైతులకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా పైలెట్ గ్రామాల్లో ఇళ్ల నిర్మాణ ప్రక్రియ వేగవంతం చేస్తున్నామని, విడతల వారీగా బిల్లుల చెల్లింపులు జరుగుతాయని తెలిపారు. పైలెట్ గ్రామాలే కాకుండా మండలంలోని మిగితా గ్రామాల్లో అర్హులైన ఇందిరమ్మ ఇళ్ల జాబితా రూపొందించేందుకు ఇందిరమ్మ కమిటీల సమన్వయంతో మండలంలోని గెజిటెడ్ స్థాయి అధికారులతో మరొకసారి ప్రతీ ఇంటికి వెళ్లి సర్వే నిర్వహించి అర్హులైన వారి జాబితాను రూపొందించేందుకు చర్యలు చేపడుతున్నామని వివరించారు.

పైపులైన్ మరమ్మతులు చేపట్టి మిషన్ భగీరథ పథకంలో నల్లా కనెక్షన్ ద్వారా శుద్ధమైన తాగునీటి సరఫరా జరుగుతోందని, పైపులైన్ ద్వారా నీటిని సరఫరా చేయలేని ప్రాంతాల్లో నీటి ట్యాంకర్లు, ఇతర ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నిరంతరం తాగునీటి అందించేందుకు మంచినీటి బావుల తవ్వకాలకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. మిషన్ భగీరథ ఇంజనీర్లు, ఎంపీడీవోలు, కార్యదర్శులు ప్రతి రోజు నీటి సరఫరాపై అదనపు కలెక్టర్ సమీక్షిస్తారని వేసవిలో తాగునీటికి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

● నకిలీ విత్తనాలు సరఫరా చేస్తే పీడీ యాక్టు

ఎస్పీ డీవీ శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో నకిలీ విత్తనాలు సరఫరా చేసే వారిపై పీడీ యాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు. అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. విత్తన విక్రయదారులు నిబంధనల ప్రకారం ప్రభుత్వం గుర్తించడిన అధిక దిగుబడి అందించే విత్తనాలు మాత్రమే రైతులకు విక్రయించాలన్నారు. నకిలీ విత్తనాల నియంత్రణలో సహకరించాలని కోరారు. సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఒత్తిడి నియంత్రణకు క్రీడలు దోహదం

ఆసిఫాబాద్‌రూరల్ (ఆంధ్రజ్యోతి): నిత్యం ఒత్తిడితో కూడుకున్న పోలీసు ఉద్యోగంలో ఒత్తిడిని నియంత్రిం చేందుకు క్రీడలు ఎంతో దోహపడుతాయని కలెక్టర్ వెంకటేష్‌దోత్రే అన్నారు. బుధవరం జిల్లా కేంద్రంలోని పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో ఆధునీకరించిన బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ కోర్టులను ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, అదనపు ఎస్పీ ప్రభాకర్ రావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలీసు ఉద్యోగం నిత్యం ఒత్తిడితో కూడుకున్నదని, నిత్య జీవితంలో క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం పొందవచ్చని తెలిపారు. బ్యాడ్మిం టన్, టేబుల్ టెన్నిస్ కోర్టులను పోలీసు అధికారులు, ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్పీ చిత్తరంజన్, సింగరేణి జీఎం విజయ్‌భాస్కర్‌రెడ్డి, ఆర్ఐ అంజన్న, సీఐలు రవీందర్, శ్రీధర్, పోలీసులు పాల్గొన్నారు.

గాలివానకు కర్బూజ తోట ధ్వంసం



బెజ్జూరులో ధ్వంసం అయిన కర్బూజ తోట

బెజ్జూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండలంలో మంగళవారం రాత్రి కురిసిన గాలివాన బీభత్సం రైతు సాగు చేసిన కర్బూజ పంటకు నష్టం కలిగించింది. కొర్తెగూడ గ్రామానికి చెందిన నందారామ్ అనే రైతు ఎకరంపావులో కర్బూజ పంట సాగు చేశాడు. మంగళవారం రాత్రి వడగళ్లతో కూడిన గాలివాన కురవడంతో పంటకు తీవ్ర నష్టం సంభవించిందని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. పంట చేతికొచ్చే సమయంలో గాలివాన బీభత్సానికి తీరని నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. పంట సాగు కోసం ఇప్పటికే వేల రూపాయలు ఖర్చు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం స్పందించి నష్టపోయిన పంటకు పరిహారం అందించాలని బాధిత రైతు కోరుతున్నాడు.

ఇద్దరి బైండోవర్

సిర్పూర్(టి), ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి) మండల కేంద్రంలో మంగళవారం రాత్రి అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని బుధవారం తహసీల్దార్ శ్రీనివాస్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై కమలాకర్ తెలిపారు. అనంతరం రెండు లక్షల వ్యక్తిగత పూచీ కత్తుపై విడుదల చేసినట్లు తెలిపారు.

కోర్టుకు గైర్హాజరవుతున్న వ్యక్తి అరెస్టు



నిందితుడితో పోలీసులు

తాండూర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): తాండూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కిష్టంపేట గ్రామానికి చెందిన లింగం రాజు అనే యువకుడిని అరెస్టు చేసి బెల్లంపల్లి జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట బుధవారం హాజరు పర్చినట్లు ఎస్‌ఐ కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. నిందితుడు రాజుపై కొన్ని కేసులు నమోదు కావడంతో అతను కోర్టుకు హాజరు కాకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. ఈ క్రమంలో బుధవారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చిన అనంతరం ఆసిఫాబాద్ జిల్లా జైలుకు తరలించినట్లు తెలిపారు.

భార్యపై గొడ్డలితో దాడి

కోటపల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొప్పారం గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి బానోత్ లక్ష్మీ అనే మహిళపై ఆమె భర్త బానోత్ పున్నం గొడ్డలితో దాడి చేశాడు. ఎస్‌ఐ రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. బానోత్ పున్నం అదే గ్రామానికి చెందిన మరో మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తూ భార్యతో పాటు కుటుంబీకులను చిత్రహింసలకు గురిచేస్తున్నాడు. కుటుంబాన్ని పట్టించుకోకుండా రాత్రివేళ సదరు మహిళ వద్దకు వెళ్తుండగా ఎటు వెళ్తున్నావని ప్రశ్నించినందుకు గొడ్డలితో లక్ష్మిపై దాడి చేశాడు. దీంతో ఆమె తలకు తీవ్ర గాయాలయ్యాయని పేర్కొన్నారు. కుటుంబీకులతో పాటు చుట్టు పక్కల వారు లక్ష్మిని 108 అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. బాధితురాలు లక్ష్మి కుమారుడు బానోత్ రాజేష్ ఫిర్యాదు మేరకు బానోత్ పున్నంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బిల్లుల కోసం కాంట్రాక్టర్ల నిరీక్షణ

- పనులు పూర్తిచేసి అప్పగించినా తప్పని ఎదురుచూపులు
- ఆందోళనలో కాంట్రాక్టర్లు



పూర్తయిన డీఆర్‌సీసీ భవనం

కాగజ్‌నగర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మున్సిపాలిటీ, మండలాల్లో పలు అభివృద్ధి పనులు పూర్తి చేసి రెండేళ్ల గడుస్తున్నా ఇంత వరకు వాటి తాలుకా బిల్లులు రాకపోవటంతో కాంట్రాక్టర్లు ఆందోళన చెందుతున్నారు. ఎన్ఆర్‌జీఎస్, మన ఊరు.. మన బడి, ఇతర పథకాలకు సంబంధించిన పనులు 2022-23 సంవత్సరంలో పనులను సంబంధిత కాంట్రాక్టర్లు, సర్పంచ్‌లతో పనులు పూర్తి చేయించారు. తమకు డబ్బులు తప్పకుండా వస్తాయన్న ధీమాతో సర్పంచ్‌లు వివిధ వడ్డీ వ్యాపారుల వద్ద నుంచి అప్పులు తెచ్చి పనులు చేసినప్పటికీ బిల్లులు పెండింగ్‌లోనే పడిపోయాయి. ఎన్నికల సమయంలో కోడ్ ఉందని బిల్లులు చెల్లించలేమని అధికారులు ఖరాఖండీగా చెప్పారన్నారు.

ఎన్నికలు ముగిసి ఇప్పటికీ ఏడాది దాటిపోయినా బిల్లులకు అతీగతీలేని పరిస్థితి ఏర్పడింది. కాగజ్‌నగర్ మండలంలోని కోటి రూపాయలకు పైగా బిల్లులు పెండింగ్‌లో ఉండటం విశేషం. తమ బిల్లులు చెల్లించాలని మాజీ సర్పంచ్‌లంతా కలిసి గత నెలలో ఎంపీడీవో కార్యాలయానికి తాళం వేసి నిరసన తెలిపారు. తాము తెచ్చిన అప్పులకు మిత్తికిమిత్తి పెరిగి పోతోందని, ఏమీ చేయాలో అర్థం కాని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన చెందారు. కొత్త పనులకు మాత్రం బిల్లులు చెల్లిస్తుండగా, పాత పనుల బిల్లులు పక్కన పెడుతుంటం ఏంటనీ సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో త్వరలోనే రాష్ట్ర స్థాయిలో పోరుబాట పడుతామని పేర్కొంటున్నారు.

అప్పు చేసి పనులు పూర్తి చేసినా..

అలాగే కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో డీఆర్‌సీసీ భవనానికి కోటీ 34 లక్షల రూపాయలతో రెండేళ్ల క్రితం పనులు ప్రారంభించారు. ఈ భవనం తాలుకా పనులు పూర్తి చేసి ఆరు నెలల క్రితం మున్సిపాలిటీకి కాంట్రాక్టర్ అప్పజెప్పారు. కాని ఇంత వరకు ఈ పనుల తాలుకా బిల్లులు పూర్తి రాక పోవటంతో కాంట్రాక్టర్ హైరానా పడుతున్నారు. తాము అప్పులు చేసి పనులు పూర్తి చేసినప్పటికీ బిల్లులు రాక పోవటంతో ఏమీ చేయాలో తెలియని పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. అలాగే ఇతర పనుల పరిస్థితి కూడా ఇదే తరహాలో ఉంది. ఇప్పటికైనా అధికారులు, నాయకులు వెంటనే స్పందించి పెండింగ్ పనుల తాలుకా బిల్లులు పూర్తిగా చెల్లించాలని కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో రమేష్‌ను వివరణ కోరగా పెండింగ్ తాలుకా బిల్లుల వివరాలను ఉన్నతాధికారులకు పంపించినట్లు తెలిపారు.



కాగజ్‌నగర్ ఎంపీడీవో కార్యాలయానికి తాళం వేసిన నిరసన తెలుపుతున్న మాజీ సర్పంచ్‌లు(ఫైల్)

జాబ్ కార్డులు ఉన్న వారందరికీ ఉపాధి

డి రాంమోహన్, ఏపీవో



ఆంధ్రజ్యోతి: ఉపాధిహామీ పథకంలో జాబ్ కార్డు ఉన్నవారందరికీ పని కల్పిస్తున్నారా?

ఏపీవో: జాబ్ కార్డు ఉన్న ప్రతీఒక్కరికి పనులు కల్పించటానికి ప్రణాళికలు రూపొందించాం. ప్రస్తుతం పనులకు వస్తున్న ఉపాధిహామీ కూలీందరికి పనులు కల్పిస్తాం.

ఆంధ్రజ్యోతి: మండలంలో ఎన్ని జాబ్ కార్డులున్నాయి?

ఏపీవో: మండలంలో 9,887 మందికి జాబ్ కార్డులున్నాయి. 5,500 మంది యాక్టీవ్‌గా పనిచేస్తున్నారు. ఈ సంవత్సరం జాబ్‌కార్డులకలు 45 దరఖాస్తులు వచ్చాయి. వాటిని కూడా పరిశీస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: రైతుల సంక్షేమం కోసం ఉపాధిహామీ ద్వారా ఎలాంటి పనులు చేపడతున్నారు?

ఏపీవో: రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని చేపల కుంటలు, పశువుల పాకలు, మేకలు, గొర్రెల పెడ్డు ఏర్పాటు చేస్తున్నాము. అంతేకాకుండా పండ్ల తోటల పెంపకంతో పాటు నీలగిరి మొక్కల పెంపకానికి కృషి చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: ఉపాధిహామీ పని ప్రదేశంలో ఎలాంటి వసతులు కల్పిస్తున్నారు?

ఏపీవో: ఉపాధి హామీ పని ప్రదేశంలో అన్ని వసతులు కల్పిస్తున్నాము. ఎండలను దృష్టిలో పెట్టుకొని ఉదయం పూటనే పనులు పూర్తి చేసేవిధంగా తగిన చర్యలు తీసుకుంటున్నాం. అలాగే మంచినీటి వసతి, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుతున్నాము.

- రెబ్బెన (ఆంధ్రజ్యోతి)

'శ్రీహర్ష'లో వీడ్కోలు హంగామా

గర్మిళ్ల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాలలోని శ్రీహర్ష డిగ్రీ కళాశాల వీడ్కోలు కార్యక్రమాన్ని బుధవారం వేంపల్లిలోని ఫంక్షన్‌హాలులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ పల్లె భూమేష్ గత సెమిస్టర్ పరీక్షల్లో తొమ్మిది గ్రేడ్ పాయింట్లు దాటిన విద్యార్థులను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత చదువులు చదివి మంచి ఉద్యోగాలు సాధించి జీవితంలో స్థిరపడాలన్నారు. కాలేజీకి, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డైరెక్టర్ మనోహర్‌రెడ్డి, శ్రావణ్, ప్రిన్సిపల్ అనితరాకూర్, లావణ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు అడ్డుకున్న దేవాదాయశాఖ అధికారులు

వాగ్వాదానికి దిగిన నిర్మాణదారులు



దేవాదాయ శాఖ అధికారులతో వాగ్వాదానికి దిగుతున్న నిర్మాణదారులు

ఆసిఫాబాద్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ మండలం గోవింద్‌పూర్ గ్రామ శివారులోని సర్వే నంబర్ 83లోని కేశవనాథ ఆలయ భూముల్లో అదే గ్రామానికి చెందిన కొంత మంది అక్రమ నిర్మాణాలు చేపడుతుండడంతో బుధవారం దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు అడ్డుకున్నారు. ఇటీవల ఆలయ భూములకు వేలం పాట నిర్వహించేందుకు తేదీని ప్రకటించారు. గోవింద్‌పూర్ గ్రామంలో వేలం పాట పోస్టర్లను అంటించేందుకు దేవాదాయ శాఖ కార్యనిర్వహణ అధికారి వేణుగోపాల్ గుప్తా, బాపిరెడ్డి, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ రవికిషన్, అటెండర్ రాజేశ్వర్, కమిటీ సభ్యులు నరేష్, మనోజ్ వెళ్లారు. ఆలయ భూముల్లో గ్రామానికి చెందిన ముగ్గురు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను చేపట్టడాన్ని గమనించారు. ఆలయ భూముల్లో ఇళ్ల నిర్మాణాలు ఎలా చేపడుతారని వారిని ప్రశ్నించారు. దీంతో వీరి మధ్య కొద్దిసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. అక్రమంగా నిర్మిస్తున్న నిర్మాణాలను వెంటనే నిలిపి వేయాలని లేని పక్షంలో శాఖాపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ విషయాన్ని కలెక్టర్, దేవాదాయ శాఖాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని దేవాదాయ శాఖాధికారులు, కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

దేశ వ్యాప్తంగా బీసీ కుల గణన చేపట్టాలి

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా బీసీ కుల గణన చేపట్టాలని కోరుతూ మంచిర్యాల పట్టణంలోని ఐబీ చౌరస్తా నుంచి హాజీపూర్ మండల కేంద్రం జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు బుధవారం పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ మాట్లాడుతూ జనగణన పట్టికలో 34 కాలమ్‌లు ఉన్నాయని, కులగణనను చేరిస్తే అదనంగా ఒక కాలం మాత్రమే చేరుతుందని, దీనికి రూపాయి కూడా ఖర్చు కాదన్నారు. ఇప్పటికైనా బీసీల డిమాండ్లను ప్రభుత్వాలు పరిష్కరించాలని లేకుంటే పోరాటాలను ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు రఘునందన్, భీమ్‌సేన్, రాములు, రాజేశం, సతీష్, రాములు, వేణుగోపాల్, సంతోష్, అంజన్న, భీమ్‌రావు, శంకర్, రాజేశం పాల్గొన్నారు.



పాదయాత్ర చేస్తున్న జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు

కొవ్వొత్తుల ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, మహిళలు

కాగజ్‌నగర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): నల్గొండ జిల్లాకు చెందిన మల్లీశ్వరి ఆత్మహత్యకు కారణమైన వ్యక్తులను వెంటనే అరెస్టు చేయాలని కోరుతూ కాగజ్‌నగర్ పట్టణంలో బుధవారం రాత్రి బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అధ్వర్యంలో కొవ్వొత్తులతో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోతోందన్నారు. మహిళల హత్యలు, ఆత్మహత్యలు పెరుగుతున్నా కూడా పట్టించుకోవటం లేదన్నారు. ఏడు సంవత్సరాల పాటు సహజీవనం చేసిన తర్వాత మల్లీశ్వరిని రెడ్డి సామాజిక వర్గానికి చెందిన యువకుడు మోసం చేసినట్టు పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి యువకుడిపై వెంటనే కేసు నమోదు చేయాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో మహిళలు వరలక్ష్మి, రమాదేవి, లావన్య, కమల, బీనా మండల్, రింకు మండల్ పాల్గొన్నారు.

దేశీదారు పట్టివేత

బెల్లంపల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హనుమాన్ బస్తీకి చెందిన సారమ్మ అనే మహిళ ఇంటిలో బుధవారం తనిఖీలు చేయగా అక్రమంగా నిల్వ ఉంచిన దేశీదారును పట్టుకున్న ఎస్‌హెచ్‌వో దేవయ్య తెలిపారు. పట్టుకున్న దేశీదారును సీజ్ చేసి దేశీదారును విక్రయిస్తున్న మహిళపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

యువత క్రీడల్లో రాణించాలి



తిర్యాణిలో విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న నాయకులు

కెరమెరి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): యువత క్రీడల్లో రాణించాలని మాజీ ఏఎంసీ చైర్మన్ మునీర్ అహ్మద్ అన్నారు. బుధవారం ఆయన ఝరి గ్రామంలో యువకులు ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో క్రీడాకారులు నైపుణ్యం ప్రదర్శించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రిజ్వాన్, కుత్బోద్దీన్ తదితరులు ఉన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

తిర్యాణి (ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని కాంగ్రెస్ నాయకుడు అనీల్‌గౌడ్ అన్నారు. మండలంలోని రొంపల్లిలో జాతీయస్థాయి వాలీబాల్ క్రీడాకారుడు ఆత్రం గణేష్ స్మారకార్థం ఏర్పాటు చేసిన వాలీబాల్ టోర్నమెంట్ బుధవారం ముగింపు సందర్భంగా బహుమతులు ప్రదానం చేశారు. క్రీడాకారులు శ్రీనివాస్, జలపతిరావు, నాయకులు వెంకటేశంగౌడ్, హెచ్ఎం కృష్ణారావు, గోపాల్, పీఈటీలు బ్రహ్మం, లక్ష్మణ్, సుభాష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు లేకుండా చూస్తాం

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

దండేపల్లి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని గూడెం గ్రామంలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక ఏర్పాటు చేస్తామని మండల ప్రత్యేకాధికారి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గాప్రసాద్ అన్నారు. బుధవారం 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో ప్రచురితమైన వేసవిలో జ(న)ల ఘోష అనే కథనానికి స్పందించిన అధికార యంత్రాంగం గూడెం గ్రామాన్ని సందర్శించి ప్రభుత్వ మంచి నీటి బావికి ఏర్పాటు చేసిన విద్యుత్ మోటార్లను ఆయన పరిశీలించారు. అనంతరం గూడెంలో పలు వీధుల్లోకి వెళ్లి ప్రజలను నేరుగా తాగునీటి సమస్యపై అడిగి తెలుసుకున్నారు. తలాపున గోదావరి నది ఉన్నప్పటికీ బావుల్లో నీరు అడుగంటడంతో ఇబ్బంది పడుతున్నామని ప్రజలు అధికారుల దృష్టికి తెచ్చారు. తాగునీటి సమస్యను ఉన్నతతాధికారుల దృష్టికి తీసుకుపోయి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంటనే ఎంపీడీవో జేఆర్ ప్రసాద్, ఎంపీవో కె విజయప్రసాద్, పంచాయతీ కార్యదర్శి నాగరాజు ఉన్నారు.



గూడెంలో మంచినీటి బావిని పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి దుర్గాప్రసాద్

సిబ్బంది సమయ పాలన పాటించాలి: డీఎంహెచ్‌వో



డీఎంహెచ్‌వోకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిబ్బంది

చింతలమానేపల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వైద్య సిబ్బంది సమయ పాలన పాటించాలని జిల్లా వైద్యాధికారి సీతారాం అన్నారు. మండలంలోని దిందా గ్రామంలోని పల్లె దావాఖాను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ప్రజలకు వైద్యం అందుబాటులో తీసుకువచ్చేందుకు పల్లె దావాఖానాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కుష్ఠ వ్యాధి నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఆరోగ్య పర్యవేక్షకులు శ్యాంలాల్, కోటేశ్వర్, శారద, స్వరూప, శకుంతల తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి వసతి కల్పించాలని రాస్తారోకో





ఖైరిగూడలో ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడుతున్న అధికారులు, మాదారంటౌన్ షిప్‌లో రాస్తారోకో చేస్తున్న మహిళలు, నాయకులు

రెబ్బెన, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి ఏరియాలోని మాదారం టౌన్ షిప్‌లో కొంత కాలంగా మంచినీటి సరఫరా సక్రమంగా ఉండటంలేదని ఖైరిగూడ ఆర్చి వద్ద ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీల ఆధ్వర్యంలో మహిళలు బుధవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రతీ నెల వారానికి రెండు, మూడు రోజులు నీటి సరఫరా సక్రమంగా ఉండటం లేదన్నారు. తద్వారా తాము మంచినీటి కోసం తీవ్ర ఇబ్బందిని ఎదుర్కొంటున్నామని వాపోయారు. వేసవి కాలం కావటంతో తమ సమస్య మరింత జటిలంగా మారినట్లు పేర్కొన్నారు. నీటి సమస్య విషయంలో సింగరేణి అధికారులు స్పందించి మంచినీటి సరఫరా ప్రతీరోజు జరిగేలా చూడాని కోరారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఆందోళనలు మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. మహిళలు రాస్తారోకో చేస్తున్న విషయం తెలుసుకున్న ఎస్‌వోటూ జీఎం రాజమల్లు, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి సంఘటన చేసుకొని మహిళలకు నచ్చజెప్పారు. తక్షణమే వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేపడుతామని, శాశ్వత పరిష్కారానికి కొత్త మోటారులను తీసుకొచ్చి బిగించి వారం రోజుల్లోగా సమస్యకు పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు. దీంతో మహిళలు రాస్తారోకోను విరమించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్ తిరుపతి, ఉపాధ్యక్షులు మొగిలి, ఐఎన్టీయూసీ ఏరియా ఉపాధ్యక్షులు పేరం శ్రీనివాస్, చంద్రకుమార్, రామారావు, పలువురు కార్మికులు, మహిళలు పాల్గొన్నారు.

● మాదారం టౌన్‌షిప్‌లో..

తాండూర్ (ఆంధ్రజ్యోతి): తాండూర్ మండలంలోని మాదారం టౌన్‌షిప్‌లోని తాగునీటి కష్టాలను తీర్చాలని కోరుతూ మహిళలు, ప్రజలు బుధవారం రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. వీరికి అధికార పార్టీ నాయకులతో పాటు టీబీజీకేఎస్, ఐఎన్‌టీయూసీ, బీఆర్ఎస్ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలు మాట్లాడుతూ మాదారం టౌన్‌షిప్‌లో తరుచూ నీటి సమస్య తలెత్తుతున్నా సింగరేణి అధికారులు, పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. దీంతో నీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతీరోజు బోరు పంపుల వద్ద నీటి కోసం క్యూ కడుతున్నామని తెలిపారు. నీటి సమస్య పరిష్కారం కోసం అధికారులు రూ. 23.70 లక్షలతో కొత్త మోటార్లు తెప్పించారు కానీ ఇక్కడున్న పంపులకు, మోటార్లకు మధ్య కేసింగ్ తేడా రావడంతో అవి బిగించే పరిస్థితి లేకుండా పోయిందని, ఇందుకు అధికారుల నిర్లక్ష్యమే కారణమని తెలిపారు. నీటి ఎద్దడి ఉన్న మాదారం టౌన్‌షిప్‌కు సింగరేణి వాటర్ ట్యాంకర్లు, పంచాయతీ ట్రాక్టర్లు నీటిని సరఫరా చేస్తున్నాయని, కానీ కొందరు నేతలు వారి ఇళ్లలో నీటిని నింపుకున్న తర్వాతనే పంపిస్తున్నారని పేర్కొంటున్నారు. వెంటనే నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ప్రజలు, కార్మికులు, నాయకులు పాల్గొన్నారు.



సింగరేణి సమాచారం

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి

శ్రీరాంపూర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 20న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి మేకల పోచమల్లు ఒక ప్రకటనలో కోరారు. ఎన్నో పోరాటాలతో సాధించుకున్న కార్మిక హక్కులను కేంద్రంలోని మోదీ సర్కార్ కాలరాస్తోందని ఆరోపించారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటుకు అప్పగిస్తూ కార్పొరేట్ శక్తులకు వంత పాడుతోందన్నారు. దేశ సంపదను కొన్నివర్గాల వారికి అప్పగించే ప్రయత్నం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. నష్టాల పేరుతో మూసివేసిన పరిశ్రమలను మళ్లీ వెంటనే ప్రారంభించాలని, దేశవ్యాప్తంగా బొగ్గు బ్లాకుల వేలంను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్లుగా సవరించి అమలు చేస్తోందన్నారు. దీనిని నిరసిస్తూ నిర్వహించే సమ్మెను జయప్రదం చేయాలని ఆయన కోరారు.

డీజీఎం(ఐఈడీ) మృతికి సంతాపం

శ్రీరాంపూర్, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి) : గుండెపోటుతో మరణించిన డీజీఎం(ఐఈడీ) చిరంజీవులుకు ఏరియా జీఎం ఎం. శ్రీనివాస్ ఆధ్వర్యంలో అధికారులు బుధవారం సంతాపం తెలిపారు. జీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో రెండు నిమిషాలు మౌనం పాటించి ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కార్యక్రమంలో ఎస్‌ఓటు జీఎం సత్యనారాయణ, అధికారుల సంఘం ఏరియా ఉపాధ్యక్షుడు కె. వెంకటేశ్వర్ రెడ్డి, శ్రీరాంపూర్ ఓసీపీ పీవో టి. శ్రీనివాస్, ఏజెంట్లు రాజేందర్, శ్రీధర్, వెంకటేశ్వర్లు, ఏరియా ఇంజినీర్ చంద్రశేఖర్ రెడ్డి, ఏరియా రక్షణాధికారి శ్రీధర్ రావు, డీజీఎంలు శ్రీధర్ రావు, శిరీషా రెడ్డి, ఎస్ఈ(ఐఈడీ) కిరణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు



హుండీ లెక్కిస్తున్న నిర్వాహకులు

బెల్లంపల్లి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోదండరామాలయం దేవాలయంలో బుధవారం దేవాలయ శాఖ పరిశీలకులు కిషన్‌గౌడ్ ఆధ్వర్యంలో హుండీ లెక్కించారు. రూ.61,106 నగదు వచ్చినట్లు ఆయన తెలిపారు. హుండీ లెక్కింపులో రామాలయం ఈవో రవి కుమార్, ఆలయ సభ్యులు బాపురెడ్డి, వేణుగోపాల్, రామక్రిష్ణ పాల్గొన్నారు.

సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి

బెల్లంపల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వ్యాపారస్తులు, ప్రజలు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని రూరల్ సీఐ అఫ్జలొద్దీన్ అన్నారు. బుధవారం కాల్‌టెక్స్ ఏరియాలో వ్యాపారస్తులకు ప్రజలకు సీ సీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన కల్పించారు. నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతోగానో ఉపయోగపడతాయని సూచించారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను నియంత్రించవచ్చునని ప్రతి ఒక్కరు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అలాగే వాహనదారులు హెల్మెట్ ధరించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు నిబంధనలను పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ మహేందర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

యువకుల రక్తదానం




రక్తదానం చేస్తున్న యువకులు

మంచిర్యాల క్రైం, ఏప్రిల్16 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల ఛత్రపతి సాహు సంఘర్షణ సమితి నాయకులు రంగుల ప్రశాంత్ జన్మదినం సందర్భంగా రక్తదాన కార్యక్రమం చేపట్టారు. మంచిర్యాల రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదానం చేశారు. నరేశ్, శ్రీనివాస్, రవీందర్, రవీందర్‌రావు పూలే, రమేశ్, హరీశ్, షమీ, వికాస్, పాల్గొన్నారు.

నూరేళ్ల జీవితం కారాదు విషాదాంతం

- సమీపిస్తున్న ఇంటర్, టెన్త్ ఫలితాలు
- పిల్లల తల్లిదండ్రుల్లో గుబులు
- ర్యాంకుల కంటే పిల్లల జీవితాలే ముఖ్యం

రాత్రనకా..పగలనకా కష్టపడి చదువుతారు. తోటి స్నేహితులతో కలిసి పోటీ పడి మరీ పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకోవాలని శ్రమిస్తారు. కానీ అనుకున్న మార్కుల కన్నా తక్కువ రావడమో, లేదా ఫెయిల్ కావడమో జరిగితే క్షణికావేశంలో నూరేళ్ల జీవితాన్ని మధ్యలోనే ముగించేయడం. ఇదీ ప్రస్తుత రోజుల్లో విద్యార్థుల ఆలోచనా తీరు. ఒక్కసారి ఫెయిల్ అయితే జీవితం మొత్తం ఫెయిల్ అయినట్లు భావించడం సరికాదని మానసిక వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నా కొందరు పిల్లలు తప్పుడు నిర్ణయాలు తీసుకుంటున్నారు. అయితే పిల్లల తప్పు కొంత అయితే తల్లిదండ్రుల తప్పు కూడా లేకపోలేదని వాదన వినిపిస్తోంది. ఫలితాల్లో తోటి విద్యార్థులు, బంధువుల పిల్లలతో పోల్చడం ప్రెస్టేజ్‌గా ఫీలవడం ఒకింత విద్యార్థుల మనోధైర్యాన్ని కోల్పోయేలా చేస్తోందని వైద్యుల అభిప్రాయం. ఫెయిల్ అయినా పాస్ అయినా పాజిటివ్ ఆలోచనతో వెళ్తే విద్యార్థులు కఠిన నిర్ణయాలు తీసుకోకుండా ఉండొచ్చు. చదువులో ఫెయిల్ అయి జీవితంతో ఎంతో ఎత్తుకు ఎదిగిన ప్రముఖులను ఉదాహరణగా తీసుకుని తల్లిదండ్రులు జాగ్రత్త వహించడం ఉత్తమం అంటున్నారు.



మంచిర్యాల క్రైం, ఏప్రిల్16 (ఆంధ్రజ్యోతి): మరి కొద్ది రోజుల్లో పదో తరగతి, ఇంటర్ ఫలితాలు వెలువడనున్నాయి. ఈ క్రమంలో అటు విద్యార్థులు, ఇటు వారి తల్లిదండ్రులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. జిల్లా మొత్తంలో పదో తరగతి విద్యార్థులు 9,332 మంది విద్యార్థులు హాజరుకాగా ఇంటర్‌లో 3,942 మంది విద్యార్థులు పరీక్షలు రాసారు. ప్రస్తుతం విద్యార్థులంతా ఫలితాల కోసం వేచి చూస్తున్నారు. మరోవైపు అటు పిల్లల కంటే వారి తల్లిదండ్రులే ఎక్కువగా ఆందోళనకు గురవుతున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు మార్కులను ప్రేమించకుండా వారి పిల్లల భవిష్యత్‌ను ఆలోచించి సబ్జెక్టుల్లో తప్పిన, మార్కులు తక్కువగా వచ్చిన వాళ్ల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీయకుండా మళ్లీ పరీక్షలు రాసుకోవచ్చంటూ పిల్లల భుజంతట్టి మనోధైర్యాన్ని నింపాలి. అంతేగాని వందశాతం మార్కులు రాలేదని, ర్యాంక్‌లు సాధించలేదని పిల్లలను తిట్టడం లేక వారిపైన అసహనం వ్యక్తం చేయడం నిండు ప్రాణాలకే ముప్పు. ఎందు కంటే సున్నిత మనసు కలవారు వారు ఇంట్లో తల్లిదండ్రులు తిట్టారని ఆత్మహత్యలకు పాల్పడుతూ ఉంటారు. దీనిని దృష్టిలో ఉంచుకుని పిల్లలపై ప్రే మ చూపిస్తూ వారి ఇష్టాలను గ్రహించి ప్రోత్సహించడమే ఎంతో మేలు.

జీవితంలో చదువు ఒక భాగం..

ప్రతీ ఒక్కరి జీవితంలో చదువు ముఖ్యమే. కానీ చదువే జీవితం కాదు అనే విషయాన్ని గ్రహించాలి. చదువు ముఖ్యమే. కానీ జీవితంలో ఎంతో మంది చదువరాని వారు కూడా గొప్ప మేధావులు ఉన్నారు. సబ్జెక్టుల్లో ఫెయిల్ అయినవారు కూడా ఒత్తిడికి గురికాకుండా మళ్లీ మళ్లీ ప్రయత్నించి ఉద్యోగాలు సంపాదించి జీవితంలో స్థిరపడ్డ వారున్నారు. ఒక డాక్టర్ ఇంజనీర్లే సుఖంగా ఉంటారనుకోవడం మూర్ఖత్వం. పిల్లలు రాజకీయంలో రాణించవచ్చు, ఒక క్రీడాకారుడు కావచ్చు పిల్లలు ఏరంగాల వైపు మొగ్గు చూపుతున్నారో నిత్యం వారిని పరిశీలించాలి. వారికి ఇష్టమైన రంగాలలో ప్రోత్సహించాలి. అంతేగాని పరీక్షల్లో మార్కులు తక్కువగా వచ్చాయంటూ విద్యార్థులను ప్రశ్నిస్తే నూరేళ్ల జీవితం చిన్న వయసులోనే ముగించే అవకాశాలున్నాయి. తస్మాస్ జాగ్రత్త ఫలితాలు రాబోతున్నాయి. పరీక్షల సమయంలో జాగ్రత్తలు చెప్పాలే కాని ఫలితాల సమయంలో కాదు.

బీటెక్‌లో ఫెయిల్ అయ్యా... అయినా బ్యాంక్ ఉద్యోగం సాధించా...

ఐడీబీఐ మేనేజర్ లక్ష్మణ్ నాయక్ జాదవ్



నేను బీటెక్‌లో ఫెయిల్ అయ్యాను. బ్యాక్‌లాగ్‌ల ఉత్తీర్ణత కోసం మూడేళ్ల శ్రమించా. ఆ సమయంలో అమ్మనాన్న ప్రోత్సాహంతో ఒక సంవత్సరం బ్యాంక్ ఉద్యోగం కోసం కోచింగ్ తీసుకున్నాను. రాలేదు, పెళ్లయ్యాక భార్య ప్రోత్సాహంతో రెండవ సారి కోచింగ్‌కు వెళ్లి రెండో ప్రయత్నంలో ఐడీబీఐలో ఉద్యోగం సాధించాను. ఫెయిల్ అయినంత మాత్రాన అన్ని కోల్పోయినట్టు కాదు. నిరుత్సాహపడకుండా ప్రయత్నం చేస్తే ఏదైన సాధించవచ్చు.

పోల్చడం మానాలి..

సునిల్, మానసిక వైద్య నిపుణులు



దేనికైన పోలిక చేయడం మానుకోవాలి. చుట్టాలకు ర్యాంక్ వచ్చింది. స్నేహితులకు ర్యాంక్ వచ్చిందంటూ విద్యార్థులను నిరుత్సాహపరచడం ప్రమాదకరం. ఒక సారి ఫెయిల్ అయినంత మాత్రాన జీవితం ఆగిపోదు. మళ్లీ ప్రయత్నం చేయాలి. చదువులోకాకుండా వ్యాపారంలో రాణించిన వారు ఎంతో మంది ఉన్నారు. పిల్లలపై ఒత్తిడి తేకండి. మన పిల్లలను మనమే ఎప్పుడు తక్కువ చేయకూడదు.



సింగరేణి సిగలో మరో మైలురాయి..

(5వ పేజీ తరువాయి)

ఓపెన్ కాస్ట్ గనుల్లో ఒక టన్ను బొగ్గు తవ్వి తీయడానికి సగటున 12 లక్షల ఓవర్ బర్డెన్ (మట్టి) తొలగిస్తుండగా, నైనీ గనిలో మాత్రం టన్ను బొగ్గుకు కేవలం రెండున్నర క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ తీస్తే సరిపోతుంది. ఈ కారణంగా నైనా బ్లాక్ సింగరేణికి లాభదాయ కమైందనే అభిప్రాయాలు ఉన్నాయి.

● అందుబాటులో నాణ్యమైన బొగ్గు..

నైనీ బ్లాక్‌లో మేలైన జీ-10 రకం నాణ్యమైన బొగ్గు లభిస్తుందని అధికారులు చెబుతున్నారు. గనిలో ఓవర్ బర్డెన్ తొలగింపు, బొగ్గు తవ్వకాలు, రవాణాకు సంబంధించి ఇప్పటికే కాంట్రాక్టర్లకు పనులు అప్పగించగా, ఇక బొగ్గు తవ్వకాలే చేపట్టవలసి ఉంది. నైనీ గనిలో ఉత్పత్తి అయ్యే బొగ్గును ప్రస్తుతం రోడ్డు మార్గంలో సమీపంలోని జరపడ రైల్వే సైడింగ్‌కు రవాణా చేసి, అక్కడి నుంచి వినియోగదారులకు సరఫరా చేయనున్నారు. ఇదిలా ఉండగా, భవిష్యత్తులో ఆ ప్రాంతంలో గల ఇతర బొగ్గు కంపెనీలతో కలిసి 60 కిలోమీటర్ల మేర ప్రత్యేక రైలు మార్గాన్ని నిర్మించే యోచన కూడా ఉంది. రాబోయే మూడేళ్లలో రైలు మార్గం కార్యరూపం దాల్చే అవకాశాలు ఉన్నాయి. నైనీ బొగ్గు బ్లాక్ కోసం మొత్తం 2255 ఎకరాల భూమిని సేకరించారు. ఇందులో 1935 ఎకరాలు అటవీ ప్రాంతం కాగా, 320 ఎకరాలు ప్రభుత్వ, ప్రైవేటు భూమి. బొగ్గు తవ్వకాల కోసం ఆయా వర్గాల నుంచి సింగేణి యాజమాన్యం ఇప్పటికే అవసరమైన అనుమతులు సాధించడంతో నైనీ బ్లాక్‌లో బొగ్గు తవ్వ కాలకు ఆటంకాలు తొలగిపోయాయి.

ఉచిత గాలికుంటు టీకాలను సద్వినియోగం చేసుకోండి



ముత్యంపల్లిలో పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారులు

కాసిపేట, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఈ నెల 16 నుంచి వచ్చే నెల 15 వరకు ఉచిత గాలికుంటూ టీకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి డాక్టర్ సరిత అన్నారు. బుధవారం ముత్యంపల్లిలో నిర్వహించిన గాలికుంటూ టీకా శిబిరానికి హాజరై మాట్లాడారు. గాలికుంటు వ్యాధిబారి నుంచి మనుషులను రక్షించుకోవాలంటే ప్రతి ఒక్కరు గాలికుంటూ టీకాలు వేయించుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని పశువుల యజమానులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. బుధవారం ముత్యంపల్లిలో 348 పశువులకు ఉచిత గాలికుంటూ నివారణ టీకాలు వేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జేవీవో సంతోష్, సిబ్బంది రవీందర్, శ్యామ్, సందీప్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలుపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి షాబొద్దీన్

కోటపల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై అధికారులు దృష్టి సారించాలని మండల ప్రత్యేకాధికారి షాబొద్దీన్ అన్నారు. గురువారం కోటపల్లి మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, గ్రామపంచాయతీల ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం కొనసాగుతున్న సంక్షేమ పథకాలపై దృష్టి పెట్టి లబ్ధిదారులకు అందేలా చూడాలన్నారు. సన్నబియ్యం, ఇందిరమ్మ ఇండ్లు, మిషన్ భగీరథ, తాగునీరు, వైద్యం తదితర అంశాలపై ఆయన సమీక్ష జరిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాఘవేందర్‌రావు, ఎంపీడీవో లక్ష్మయ్య ఏవో సాయికృష్ణ, ఎంపీవో అక్తర్ మొహియొద్దీన్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

కోటపల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : బంజారాలంతా చెడు వ్యసనాలకు దూరంగా ఉండి సత్ప్రవర్తనతో మెలగాలని సేవాలాల్ దీక్ష గురువు ప్రేమ్‌సింగ్ మహారాజ్ అన్నారు. బుధవారం మండలంలోని ఎసన్వాయి గ్రామంలో సేవాలాల్ మహారాజ్ జగదాంబదేవి ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం ఐదుగురితో కూడిన నాయక్ కారోబార్‌ల కమిటీని ఏర్పాటు చేశారు. వీరికి తండా బాధ్యతలను అప్పగించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచు సీమా నాయక్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు శంకర్ నాయక్, తండా పెద్దలు దూప్ నాయక్, లోకేష్, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

ధ్వజస్తంభం ప్రతిష్ఠ

కాసిపేట, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యంపల్లి ఆంజనేయ స్వామి ఆలయంలో బుధవారం ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. అంజనేయ ఆలయంలో వేద పండితుల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి ధ్వజస్తంభాన్ని ఏర్పాటు చేశారు. అంజనేయ స్వామి ఆలయంలో ప్రతి రోజు ప్రత్యేక పూజలతోపాటు వివిధ సామాజిక కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఆలయ కమిటీ సభ్యులు, స్వాములు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలు జాగ్రత్తలు తీసుకోవాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న డీఆర్‌డీవో కిషన్

మందమర్రిరూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి కూలీలు పనులు చోట జాగ్రత్తలు తీసుకుంటూ పనులను చేయాలని డీఆర్‌డీవో కిషన్ సూచించారు. బుధవారం మండలంలోని చిర్రకుంట గ్రామంలో ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పనులకు వచ్చేటప్పుడు వెంట మంచినీరు తెచ్చుకోవాలని సూచించారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున ఉదయం పూటనే పనులను ముగించుకోవాలన్నారు. ప్రతి కూలీ ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేశారు. అనంతరం పాత బస్టాండ్‌లో మహిళల పెట్రోలు బంకు ఏర్పాటు కోసం స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశ్వర్, తహసీల్దార్ సతీష్‌కుమార్, ఏపీవో రజియాసుల్తానా, టీఏ రాజన్న, రాజమల్లు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల జీతాలను అందించాలి



ఎంపీవోకు వినతి పత్రం ఇస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్‌లు

భీమారం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మూడు నెలల నుంచి వేతనాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రభుత్వం వెంటనే స్పందించి తమ పెండింగ్ జీతాలను అందించి ఆదుకోవాలని ఫీల్డ్ అసిస్టెంట్ సంఘం జిల్లా అధ్యక్షుడు నక్క రాజన్న పేర్కొన్నారు. ఈ మేరకు ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీవో సతీష్ రెడ్డికి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. చాలీ చాలని వేతనాలతో బతుకుదెరువును నెట్టుకొస్తున్నామని నెల నెల జీతాలు రాకపోవడంతో అప్పుల పాలవుతున్నామని పెండింగ్ సాలరీలను విడుదల చేసి తమకు ఉద్యోగ భద్రతతో పాటు పేస్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఎడ్ల శ్రీనివాస్, తిరుపతి, బన్సిలాల్, కిష్టయ్యతో పాటు పలువురు ఉన్నారు.

గ్యాస్ సబ్సిడీ వెంటనే విడుదల చేయాలి

తాండూర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : వంటగ్యాస్ సబ్సిడీని వెంటనే విడుల చేయాలని కోరుతూ టీడీపీ మండల అధ్యక్షుడు దాసరి శ్రీనివఅస్ బుధవారం డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్‌కు వినతి పత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీతో వంట గ్యాస్‌ను అందిస్తుందని, సిలిండర్ ధర రూ. 927 ఉండగా ఇందులో ప్రభుత్వ సబ్సిడీ రూ. 327 రూపాయలు వినియోగదారుల ఖాతాలోకి రావాల్సి ఉండగా రావడం లేదన్నారు. గత ఆరు నెలల నుంచి సబ్సిడీ రాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే సబ్సిడీ వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

భూ భారతితోనే సమస్యల పరిష్కారం

కలెక్టర్ కుమార్ దీపక్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

దండేపల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ధరణి స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ భారతి నూతన ఆర్ఓఆర్ పోర్టల్ ద్వారా రైతుల భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. దండేపల్లి తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో బుధవారం ఆర్‌డీవో శ్రీనివాస్ రావుతో కలిసి రైతులకు నూతన చట్టంపై అవగాహన కల్పించారు. కలెక్టర్ మాట్లా డుతూ భూ భారతీ ద్వారా హక్కుల రికా ర్డులలో తప్పులు సవరణకు అవకాశం కల్పించారన్నారు. రిజిస్ట్రేషన్, మ్యూటేషన్ చేసేందుకు ముందు భూముల వివరాలు పూర్తిస్థాయిలో సర్వే చేసి, మ్యాప్ తయారు చేస్తామన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒక మండలాన్ని ఎంపిక చేసి మండలంలోని అన్ని రకాల సమస్యలను తెలుసుకొని నిర్ణీత గడువులో పరిష్కరిస్తామన్నారు. భూదాన్ అసైన్ దేవాదాయ, వక్ఫ్ భూములపట్టాలు రద్దు చేసే అవకాశం వంటి అంశాలను పొందు పర్చిందన్నారు. ఈనెల 30వ తేదీ వరకు జిల్లాలోని అన్ని మండలాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. అనంతరం మండలంలోని గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కిట్లను కలెక్టర్ చేతుల మీదుగా పంపిణి చేశారు. కార్యక్రమంలో షెడ్యూల్ కులాల సహకార సంస్థ ఈడి దుర్గ ప్రసాద్, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఆజ్మీర పురషోత్తం నాయక్, లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ తిరుపతి, తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో జేఆర్ ప్రసాద్ పాల్గొన్నారు.

దయచేసి గుడుంబా అమ్మవద్దు

- గుడుంబా నిర్మూలనకు పోలీసుల ప్రచారం



మంగెనపల్లిలో గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ శ్యామ్ పటేల్

వేమనపల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గుడుంబా నిర్మూలనకు నీల్వాయి పోలీసులు వినూత్న ప్రచారం చేస్తున్నారు. మండలంలో చాలా గ్రామాల్లో పెద్ద మొత్తంలో గుడుంబా తయారు, విక్రయాలు జరుగుతుండడంతో గుడుంబాను రూపుమాపేందుకు పోలీసులు కంకణం కట్టుకున్నారు ఈ నేపథ్యంలో కొన్ని రోజుల నుంచి గ్రామాల్లో గుడుంబా, నాటు సారా విక్రయాలు జరపవద్దని గ్రామాల యువకులతో కలిసి ప్రచారం చేస్తున్నారు. బుధవారం మండలంలోని మంగెనపల్లి గ్రామంలో నీల్వాయి ఎస్‌ఐ శ్యామ్‌పటేల్ ఆధ్వర్యంలో గ్రామ యువకులు, పోలీసులు గుడుంబా నిర్మూలించాలంటూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం గుడుంబా విక్రయించే వారి ఇండ్లకు ఎస్‌ఐ వెళ్లి గుడుంబా విక్రయిస్తున్న వారికి పుష్ప గుచ్ఛాలు అందించి అమ్మకాలు చేయవద్దని విజ్ఞప్తి చేశారు. ఎస్‌ఐ మాట్లాడుతూ గుడుంబా తాగడం వల్ల అనారోగ్యానికి గురై చాల మంది గిరిజనులు ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. ఈ వృత్తికి బదులు మంచి వృత్తిని ఎంచుకుని సమాజంలో గౌరవంగా బతకాలని సూచించారు. తాము చెప్పినా వినకుండా గుడుంబా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, యువకులు పాల్గొన్నారు.

మందమర్రిలో కాంగ్రెస్ నాయకుల రాస్తారోకో



మందమర్రిలో రాస్తారోకో చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మందమర్రిటౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకురాలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీలపై ఈడీ పెట్టిన అక్రమ కేసులకు నిరసనగా బుధవారం మందమర్రి పట్టణంలోని కోల్‌బెల్ట్ రోడ్డుపై కాంగ్రెస్ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. అక్కడ నుంచి ర్యాలీగా అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సొత్కు సుదర్శన్, నెరివెట్ల శ్రీనివాస్‌లు మాట్లాడుతూ కావాలనే తమ నాయకులపై కేంద్ర ప్రభుత్వం అక్రమ కేసులు పెడుతుందన్నారు. కక్ష సాధింపు రాజకీయాలతో సాధించేది ఏమి లేదని కేంద్రం గుర్తించాలన్నారు. గతంలో రాహుల్‌గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని చూసినా సాధ్యం కాలేదన్నారు. రానున్న రోజుల్లో కేంద్రం విధానాలపై ప్రజలు తిరగబడే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. కేసులు ఉపసంహరించుకునే వరకు ఆందోళనలు కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మంద తిరుమల్‌రెడ్డి, షల్లూరి లక్ష్మణ్, రాయబారపు కిరణ్, కూకట్ల తిరుపతి, ఎండీ ఇసాక్, జావెద్‌ఖాన్, మహంత్ అర్జున్‌కుమార్ పాల్గొన్నారు.


చెన్నూరు : కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియగాంధీ, రాహుల్ గాంధీపై ఈడీ పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని కోరుతూ బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు చెన్నూరు పట్టణంలో రాస్తా రోకో నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని, వీటిని మానుకోవాలన్నారు. కేసులు ఉపసంహరించు కోకపోతే ఆందోలనలు తీవ్రతరం చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేషన్ దుకాణాలపై దాడులు

దండేపల్లి, (లక్షెట్టిపేట) ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట మున్సిపాలిటిలో కోర్టు ఏరియాలోని 12వ నెంబర్ చౌక ధరల దుకాణంలో సివిల్ సప్లై అధికారి వేణుగోపాల్, సివిల్ సప్లై ఇన్స్పెక్టర్ భూమేష్ పక్కా సమాచారం మేరకు బుధవారం దాడులు నిర్వహించారు. ఈమేరకు వారు తనిఖీలు చేపట్టగా దొడ్డు బియ్యం 12వ రేషన్ షాపులో 60 క్వింటాళ్ల 31 కిలోలకు బదులు 21 క్వింటాళ్ల 50కిలోలు ఉన్నాయన్నారు. అదే విదంగా సన్న బియ్యం 30 క్వింటాళ్ల గాను 13 క్వింటాళ్ల 90 కిలోలు తక్కువగా ఉన్నట్లు తెలిపారు. షాపు నిర్వాహకులు అనసూర్యపై 6ఏ, క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

జైపూర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : మండంలోని గంగిపెల్లి, కుందారం, కిష్టాపూర్, పొనూరు, శివ్వారం, బెజ్జాల,ముదిగుంట గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఐకేపీ ఏపీఎం రాజ్‌కుమార్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రైతులు నాణ్యమైన ధాన్యం కేంద్రాలకు తీసుకురావాలన్నారు. ఏ గ్రేడ్ రకానికి రూ. 2320, అదనంగా రూ. 500 బోనస్ ప్రభుత్వం అందిస్తుందన్నారు. కామన్ గ్రేడ్ రకానికి రూ. 2300 అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీసీలు, రైతులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



కేసులను త్వరితగతిన పరిష్కరించాలి

● డీసీపీ భాస్కర్



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ భాస్కర్

మంచిర్యాలక్రైం, ఏప్రిల్16 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించేం దుకు కృషి చేయాలని డీసీపీ భాస్కర్ అన్నారు. బుధవారం డీసీపీ కార్యాలయంలో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదు చేయడానికి వచ్చినవారితో మర్యాదగా మాట్లాడాలని కేసులు పెండింగ్‌కు సంబంధించిన వాటిని క్షుణ్ణంగా పరిశీలించి వాటి సమస్య పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై పాల్గొన్న వారిపై కఠినంగా వ్యవహరించాలని చట్టబద్ధమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. స్టేషన్‌లో రికార్డులను ఎప్పటికప్పుడు పెండింగ్‌లో ఉండకుండా పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో మంచిర్యాల, జైపూర్, బెల్లంపల్లి ఏసీపీలు ఆర్. ప్రకాశ్, వెంకటేశ్వర్, రవికుమార్, సీఐలు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ బియ్యం సరఫరాపై ప్రచారం అవాస్తవం

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : చౌకధరల దుకాణాల ద్వారా ప్లాస్టిక్ బియ్యం సరఫరాపై జరుగుతున్న ప్రచారం అవాస్తవమని, అసత్య ప్రచారాలు చేస్తున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్ ఒక ప్రకటనలో తెలిపారు. రేషన్‌షాపుల ద్వారా పంపిణీ చేస్తున్న సన్న బియ్యంలో ప్లాస్టిక్ బియ్యం ఉన్నాయంటూ సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని తెలిపారు. పెద్దపల్లి జిల్లాలోని గోదావరిఖని తిలక్‌నగర్‌లో సన్నబియ్యంలో ప్లాస్టిక్ బియ్యం కలిశాయని ఫేస్‌బుక్, ఎక్స్‌లో వీడియోలు ప్రచారం చేశారని, ఈ విషయంపై జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి స్పందించి తిలక్‌నగర్‌లో ఎలాంటి ప్లాస్టిక్ బియ్యం సరఫరా జరగలేదని, అసత్య ప్రచారం చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు.

సింగరేణి సిగలో మరో మైలురాయి..

● ఇతర రాష్ట్రాల్లో బొగ్గు ఉత్పత్తికి శ్రీకారం
● ఒడిశాలో నైనీ బొగ్గు బ్లాక్‌ను ప్రారంభించిన సంస్థ
● ఏడాదికి కోటి టన్నుల బొగ్గు ఉత్పత్తి సామర్థ్యం
● 38 ఏళ్లపాటు ఉత్పత్తి అంచనా



నైనీ బొగ్గుగని సైట్ ఆఫీస్



బొగ్గు బ్లాకును వర్చువల్‌గా ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

మంచిర్యాల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): బొగ్గు ఉత్పత్తిలో రారాజు సింగరేణి మరో మైలురాయిని తన ఖాతాలో వేసుకుంది. తన 13దశాబ్దాల చరిత్రలో తొలిసారిగా ఇతర రాష్ట్రాల్లో బొగ్గు తవ్వకాలను బుధవారం ఎట్టకేలకు ప్రారంభించింది. ఒడిశా రాష్ట్రంలోని అంగుల్ జిల్లాలో సింగరేణి సంస్థకు కేటాయించిన నైనీ బొగ్గు బ్లాక్‌ను బుధవారం డిప్యూటీ సీఎం, రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క వర్చువల్‌గా ప్రారంభించారు. ఇప్పటి వరకు తెలంగాణ రాష్ట్రానికే పరిమితం అయిన బొగ్గు ఉత్పత్తిని సింగరేణి ఇతర రాష్ట్రాలకు విస్తరించి చారిత్రాత్మక ఘట్టానికి తెర లేపింది. కాగా నైనీ బొగ్గు బ్లాక్ వల్ల అంగుల్ ప్రాంత ప్రజల ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడనున్నాయి. అక్కడ 1600 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేసే యోచనలో సింగరేణి యాజమాన్యం ఉంది.

సుదీర్ఘ నిరీక్షణ తరువాత....

నైనీ బొగ్గు బ్లాక్ ప్రారంభానికి సుదీర్ఘ నిరీక్షణ తరువాత ఎట్టకేలకు మోక్షం లభించింది. వివిధ రకాల అనుమతులు లభించడంలో జాప్యం కారణంగా సుదీర్ఘ నిరీక్షణ తప్పలేదు. 2016 మేలో ఈ గనిని కేంద్ర బొగ్గు మంత్రిత్వశాఖ సింగరేణికి కేటాయించింది. అన్ని రకాల అనుమతులు సాధించి, గనిలో తవ్వకాలు ప్రారంభించడానికి తొమ్మిదేళ్ల సుదీర్ఘకాలం నిరీక్షించాల్సి వచ్చింది. సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రత్యేక చొరవతో కేంద్ర మంత్రులకు విజ్ఞప్తి చేయడంతో ఎట్టకేలకు మార్గం సుగమం అయింది. డిప్యూటీ సీఎం భట్టి పలుమార్లు ఒడిశాలో పర్యటించి, అక్కడి ప్రభుత్వంతో చర్చలు జరపడంతో తొమ్మిదేళ్ల కల సాకారం అయింది. దీంతో సింగరేణికి అతిపెద్ద బొగ్గు బ్లాక్ చేతికిరాగా, అధిక ఉత్పత్తికి బాటలు పడ్డాయి. ప్రస్తుతం ఒడిశాలో అడుగుపెట్టిన సంస్థ, భవిష్యత్తులో ఇతర రాష్ట్రాలకూ విస్తరించే అవకాశాలు ఉన్నాయి.

పది మిలియన్ టన్నుల ఉత్పత్తికి అవకాశం...

నైనీ బొగ్గు బ్లాక్‌లో పది మిలియన్ టన్నుల ఉత్పత్తికి అవకాశం ఉంది. గనిలో 340.78 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు తవ్వి తీసేందుకు వెసులుబాటు లభించింది. సింగరేణి వ్యాప్తంగా ప్రస్తుతం ఉన్న 17 ఓపెన్ కాస్టుగనుల కన్నా నైనీ బొగ్గుబ్లాక్ అతి పెద్దది కానుంది. ఏడాదికి కోటి టన్నుల చొప్పున 38 ఏళ్ల పాటు గని నుంచి బొగ్గును తవ్వి తీయనున్నారు. తెలంగాణలోని...

(తరువాయి 7లో)

లబ్ధిదారులు సన్నబియ్యం

సద్వినియోగం చేసుకోవాలి

సీహెచ్ బ్రహ్మరావు, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

రాష్ట్ర ప్రభుత్వం అందించే సన్న బియ్యం పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పౌరసరఫరా శాఖ అధికారి బ్రహ్మరావు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా సన్నం బియ్యం పంపిణీతో పాటు పలు అంశాలపై ఆయన 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి : జిల్లాలో మొత్తం ఎన్ని రేషన్ కార్డులు ఉన్నాయి?

అధికారి : జిల్లా వ్యాప్తంగా మొత్తం 2,19,106 రేషన్ కార్డులు ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి : ఇప్పటి వరకు సన్న బియ్యం పంపిణీ ఎంత శాతం పూర్తి చేశారు?

అధికారి : జిల్లాలో ఇప్పటి వరకు 3759.328 మెట్రిక్ టన్నుల సన్న బియ్యాన్ని పంపిణీ చేశాం.

ఆంధ్రజ్యోతి : సన్న బియ్యం పంపిణీ ప్రారంభం అయ్యాయి ఏమైనా లోటుపాట్లు ఎదురవుతున్నాయా?

అధికారి : అలాంటిది ఏమీ లేదు. జిల్లా కలెక్టర్ పథకం అమలు కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఎక్కడా లోటు పాట్లు జరగకుండా లబ్ధిదారులకు బియ్యం అందేలా చర్యలు తీసుకుంటున్నాము.

ఆంధ్రజ్యోతి : ఇప్పటి వరకు బియ్యం పంపిణీలో అవకతవకలు జరిగినట్లు ఏమైనా ఫిర్యాదులు వచ్చాయా?

అధికారి : జిల్లాలో సన్నబియ్యం పంపిణీలో ఎలాంటి అవకతవకలు జరిగినట్లు మా దృష్టికి రాలేదు. ఎవరైనా అవకతవకలకు పాల్పడితే శాఖపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు రేషన్ డీలర్ షాపును రద్దు చేస్తాం.

ఆంధ్రజ్యోతి : కొన్ని ప్రాంతాల్లో సన్నబియ్యంపై ఆరోపణలు వస్తున్నాయి. మీ దృష్టికి వచ్చిందా. దీనిపై మీ స్పందన ఏమిటి?

అధికారి : సోషల్ మీడియాలో కొంత మంది వ్యక్తులు కావాలని తప్పుదోవ పట్టించే విధంగా ప్లాస్టిక్ బియ్యం పంపిణీ చేస్తున్నారని, దొడ్డు బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి పంపిణీ చేస్తున్నారని ప్రచారం చేస్తున్నారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. దొడ్డు బియ్యాన్ని సన్నబియ్యంగా మార్చడం కుదరదు. అలా చేస్తే పూర్తిగా విరిగిపోతుంది. ప్లాస్టిక్ బియ్యాన్ని బియ్యంలో కలిపి పంపిణీ చేస్తున్నామనే ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దు. నాణ్యతతో కూడిన సన్నబియ్యాన్ని ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. రేషన్ డీలర్లు అవకతవకలకు పాల్పడితే మా దృష్టికి తీసుకురావాలి. ఎక్కడా అసౌకర్యం లేకుండా లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేస్తున్నాం.

-మంచిర్యాల కలెక్టరేట్, (ఆంధ్రజ్యోతి) :

నూరేళ్ల జీవితం..కారాదు విషాదాంతం

● సమీపిస్తున్న ఇంటర్, టెన్త్ ఫలితాలు
● పిల్లల తల్లిదండ్రుల్లో గుబులు
● ర్యాంకుల కంటే పిల్లల జీవితాలే ముఖ్యం

7

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



చెక్కుల పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

మంచిర్యాల క్రైం, ఏప్రిల్16 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. ఎమ్మెల్యే నివాసం వద్ద కల్యాణలక్ష్మీ, షాదిముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ కార్యక్రమం చేపట్టారు. కార్పొరేషన్ పరిధిలో కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ 253మంది లబ్ధిదారులకు చెక్కుల పంపిణీతో పాటు సీఎం రిలీఫ్ ఫండ్ 345 మంది లబ్ధిదా రులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో తూముల నరేశ్, చిట్ల సత్యనారాయణ, పూదరి తిరుపతి, పెంట రజిత, సతీష్‌యాదవ్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే భూ భారతి

● కలెక్టర్ కుమార్ దీపక్



జన్నారంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

జన్నారం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : భూమి సమస్యల శాశ్వత పరిష్కారం కోసమే ప్రభుత్వం భూ భారతి చట్టంను ఏర్పాటు చేసిందని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో భూభారతిపై ఏ ర్పాటు చేసిన రైతుల అవగాహన సదస్సుకు హాజరై ప్రసంగించారు. గతంలో ధరణిలో కొన్ని లోపాలుండడం వల్ల భూ సమస్యలు పరిష్కారం కాలేదని, ఇప్పుడు ప్రభుత్వం రూపొందించిన భూ భారతిలో వాటిని సరి చేసిందన్నారు. భూ భారతిలో రెవెన్యూ రికార్డులను సరిగ్గా మెయింటెన్ చేస్తారని, ప్రతి సంవత్సరం భూముల రికార్డులను తీసి ఆ ఫైళ్లను తహసీల్దార్ కార్యాలయంలో భద్రపరు స్తామన్నారు. ఇప్పుడు అమలు చేస్తున్న భూభారతిలో సైతం ఎలాంటి లోపాలున్నా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. భూమికి సంబంధించి ఏదైనా తప్పు జరిగితే సంబంధిత తహసీల్దార్ దృష్టికి తీసుకువెళ్లవచ్చని అక్కడ పరిష్కారం కాకపోతే ఆర్డీవోకు అప్పీలు చేసుకోవచ్చని అక్కడ కూడా న్యాయం జరక్కపోతే కలెక్టర్‌కు అప్పీలు చేసు కునే అవకాశం భూ భారతిలో ఉందని తెలిపారు. గతంలో ధరణిలో లేని సాదా బైనామాలకు భూ భారతిలో ఆప్షన్ ఉందని రైతులు భూ సమస్యలపై కలెక్టర్ వరకు రాకుండా తహసీల్దార్ వద్దనే పరిష్కారమయ్యే విధంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. అనంతరం మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మోతిలాల్, ఆర్డీవో శ్రీనివాస్, జిల్లా వ్యవసాయాధికారి కల్పన, ఏడీ శ్రీనివాస్, పొనకల్ పీఏసీఎస్ చైర్మన్ అల్లం రవి, తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి, ఏపీఎం బుచ్చన్న, సీసీ నాగలక్ష్మీ, బుక్ కీపర్ శాంతి, వ్యవసాయాధికారులు, కేంద్రాల నిర్వహకులు పాల్గొన్నారు. ఏఈవోలు త్రిసంధ్య, అక్రమ్, కాంగ్రెస్ నాయకులు రాజశేఖర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి రైతులు పాల్గొన్నారు.

కక్షపూరితంగా సోనియా, రాహుల్‌గాంధీపై కేసు



ఐటీ ఆఫీసు వద్ద ధర్నా చేస్తున్న డీసీసీ అధ్యక్షురాలు సురేఖ

● డీసీసీ అధ్యక్షురాలు సురేఖ

మంచిర్యాల క్రైం, ఏప్రిల్16 (ఆంధ్రజ్యోతి): నేషనల్‌హెరాల్డ్ విషయంలో బీజేపీ ప్రభుత్వం కక్షపూరితంగా ఏఐసీసీ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ పేర్లను చార్జీషీట్‌లో చేర్చారని డీసీసీ అధ్య క్షురాలు కొక్కిరాల సురేఖ అన్నారు. బుధవారం ఏఐసీసీ, టీపీసీసీ ఇచ్చిన పిలుపు మేరకు ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఐటీ ఆఫీసు వద్ద కాంగ్రెస్ నాయకులు ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహ రిస్తోందన్నారు. కాంగ్రెస్‌ను ఖతం చేసేందుకు కుటిల యత్నం చేస్తున్నారని దీనికోసం ఈడీని ప్రయోగిస్తూ కాంగ్రెస్‌కు సంబంధించిన ఆస్తులను జప్తు చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైన బీజేపీ ప్రభుత్వం కక్షపూరిత వ్యవహారాలను మానుకోవాలని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో నాయకులు తూముల నరేశ్, చిట్ల సత్యనారాయణ, తిరుపతి, పెంట రజిత, సతీష్‌యాదవ్, పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

● సీపీ అంబర్‌కిషోర్‌ఝా



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న సీపీ అంబర్‌కిషోర్‌ఝా

మంచిర్యాలక్రైం, ఏప్రిల్16 (ఆంధ్రజ్యోతి): నిరంతరం విధులు నిర్వహించే పోలీసు సిబ్బందికి ఎదురయ్యే ఆరోగ్య సమస్యల పట్ల శ్రద్ధ తీసుకొని జాగ్రత్తలు వహించాలని రామగుండం పోలీసు కమిషనర్ అంబర్‌కిషోర్‌ఝా అన్నారు. రామగుండం పోలీసు కమిషనరేట్ పరిధిలో సిబ్బందికి మెగా హెల్త్‌క్యాంప్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో వైద్య నిపుణులు శ్రీకాంత్, డాక్టర్ సునిల్ సిబ్బంది పాల్గొన్నారు. వైద్యులు సిబ్బందికి అన్ని పరీక్షలు నిర్వహించారు. అత్యవసర సమయంలో సీపీఆర్ చేసే విధానాన్ని సిబ్బందికి ఎలా చేయాలో సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలన్నారు. పోలీసు సిబ్బంది అధికారులు పాల్గొన్నారు.

డాక్టర్ పట్టా పొందిన యువతికి సన్మానం

జన్నారం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల ఎంబీబీఎస్ పూర్తి చేసి డాక్టర్ పట్టా పొందిన గంజాయిల ఆకాంక్షను బుధవారం తిమ్మాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రావు, ఉపాధ్యాయులు సన్మానించారు. పేదరికం ఉన్నత చదువులకు అడ్డు కాదని, కష్టపడితే ఏదైనా సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామ్‌రెడ్డి, బీనా, రాజు, సురేందర్, వినోద్ పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



గర్భిణికి సీమంతం చేస్తున్న జిల్లా సంక్షేమాధికారి, సీడీపీవో

చెన్నూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి రాజేశ్వరి, సీడీపీవో మనోరమ పేర్కొన్నారు. బుధవారం చెన్నూరులోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ పక్షోత్సవాల్లో పాల్గొన్నారు. గర్భిణులకు సీమంతం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, బాలికలు, పౌష్టికాహారం తీసుకోవడంవల్ల ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందిస్తామని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్లు చిరుధాన్యాలు, బాలామృతంతో చేసిన వివిధ రకాల వంటకాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ సువర్ణ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఘనంగా సంకట హర చతుర్థి

శ్రీరాంపూర్, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి) : నస్పూర్ పట్టణం హౌసింగ్‌బోర్డ్ కాలనీలోని శ్రీ లక్ష్మీగణపతి దేవాలయంలో బుధవారం సంకట హరచతుర్థి ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం అష్ట ద్రవ్య గణపతి, లక్ష్మీగణపతి హోమం, స్వామివారికి పెరుగుతో అభిషేకం చేశారు. పల్లకి సేవ, చంద్రదర్శనం, అన్నదానం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యల పాల్గొని స్వామి వారిని దర్శించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఆలయ కమిటీ చైర్మన్ రఘుపతి రావు, ప్రధాన అర్చకులు గంగారపు వంశీకృష్ణ శర్మ, భక్తులు పాల్గొన్నారు.

గర్భిణులకు మెరుగైన వైద్యం అందించాలి



వైద్యులు, సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్

● డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్

గర్మిళ్ల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : మాతా శిశు ఆసుపత్రికి వచ్చే గర్భిణులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డీఎంహెచ్‌వో హరీ ష్‌రాజ్ సూచించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మాతా శిశు సంర క్షణ కేంద్రాన్ని సందర్శించారు. వైద్యులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలో హెల్ప్ డెస్క్‌కు కేటాయించిన వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని, రోగులు, గర్భవతులకు సేవలు అందించడంలో ముందుండాలన్నారు. హైరిస్క్ గర్భవతుల పూర్తి వివరాలను నమోదు చేసుకుని వైద్యులకు చేర వేయాలన్నారు. వైద్యులు సాధారణ ప్రసవాలను చేయాలని సూచించారు. గర్భిణులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు ప్రియదర్శిని, నర్సింగ్ ఆఫీసర్‌లు ప్రసాద్, అనిల్‌కుమార్, మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, వెంకటసాయి పాల్గొన్నారు.

బెంగుళూరు మిలటరీ పాఠశాలకు ఎంపిక



విద్యార్థి ఆకాష్ పటేల్‌కు జ్ఞాపిక అందిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్ (ఫైల్)

కోటపల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : కన్నవారి కలలను నిజం చేస్తూ జాతీయ స్థాయిలో రాణించి ఔరా అనిపించుకుంటున్నాడు ఈ విద్యార్థి.. ఆ తల్లిదండ్రులది వ్యవసాయ కుటుంబం. పక్కా పల్లెటూరు అయినా చదువుపై ఇష్టం పెంచుకుని సాధన చేసి మెరికల్లా మెరిశాడు విద్యార్థి గుర్రం ఆకాష్ పటేల్.. దేశ వ్యాప్తంగా జాతీయ స్థాయిలో 2024 డిసెంబర్‌లో నిర్వహిం చిన మిలటరీ స్కూల్ ప్రవేశ పరీక్షలో అత్యంత ప్రతిభ కనబర్చి రాపనపల్లి నుంచి రాష్ట్రీయ మిలటరీ పాఠశాలకు ఎంపికయ్యాడు ఈ విద్యార్థి..

కోటపల్లి మండలం రాపనపల్లి గ్రామానికి చెందిన గుర్రం సమ్మయ్య-రాణి దంపతుల పెద్ద కుమారుడు ఆకాష్ పటేల్. ఆకాష్ 3వ తరగతి వరకు చెన్నూరులో చదివాడు. తర్వాత 5 వతరగతి వరకు మంచిర్యాల మంద మర్రిలోని లత ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నవోదయ సైనిక పాఠశాలలో చదివిన ఆకాష్ పటేల్ జాతీయ స్థాయిలో నిర్వహించిన మిలటరీ పాఠశాల ప్రవేశ పరీక్షలో 150 మార్కులకు గాను 122 మార్కులు సాధించి రాష్ట్రీయ మిలటరీ స్కూల్‌కు ఆరవ తరగతిలో ప్రవేశం పొందేందుకు అర్హత సంపాదించాడు.

● జాతీయ స్థాయిలో ఐదు పాఠశాలలు..

రక్షణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో కొనసాగే ఈ రాష్ట్రీయ మిలటరీ పాఠశాలలు జాతీయ స్థా యిలో ఐదు మాత్రమే ఉన్నాయి. హిమాచల్ ప్రదేశ్‌లోని చైల్, కర్ణాటకలోని బెంగుళూరు, బెల్గాం ప్రాంతాల్లో, రాజస్థాన్‌లోని దొల్‌పూర్, అజ్మీర్ ప్రాంతాల్లో మాత్రమే ఉన్నాయి. 1925లో వీటిని స్థాపించాడు. 1966లో మిలటరి స్కూళ్లగాను, 2007లో రాష్ట్రీయ మిలటరీ స్కూల్స్‌గా రూపాంతరం చెందాయి. ఈ పాఠశాలల్లో మిలటరి విభాగాల్లో విధులు నిర్వర్తించే వారి కుటుంబాల పిల్లలకు 70 శాతం సీట్లు కేటాయిస్తారు. మిగితా 30 శాతం సీట్లు సాధారణ పౌరులు, సామాన్య ప్రజానీకం కుటుంబాల విద్యార్థులకు పోటీ పరీక్షలో వచ్చిన మార్కులు, ప్రతిభ ఆధారంగా కేటాయిస్తారు.